మినీకథ

# మరో ప్రేమలేఖ

ప్రేమామృతమూర్తి అయిన నీకు,

మదీయ ఎదనిండా వేదనని చదును చేసిన తదీయ వద్దులే అచ్చ తెలుగు అప్పుకి వదలక ఇక్కడ వుపయోగిస్తే, నీవు దీన్ని పూర్తిగా చదవక చింపే ప్రమాదం వుంది ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నాకు అచ్చ తెలుగు కూడా వచ్చు అయినా నాకు చేతనైన సులభశైలిలో నా హృదయాన్ని నీ ముందు విప్పుతున్నాను ఇక్కడ శిల్పం ప్రధానం కాదు

మొన్న తెల్ల కాగితాలు కొనుక్కొస్తూ నిన్ను మా ఎదిరింట్లో చూసాను ఇంతకీ పేరేమిటో కూడా తెలుసుకోకుండా ఆ కాగితాలపైనే ఈ వుత్తరం వ్రాస్తున్నాను (ఛ, నీ వంటి తెలుపు ముందు ఈ కాగితాలు నల్లగా వున్నట్లున్నాయ్.)

నా ప్రేమ నేను వ్రాసే మినీ కథల్లా స్వల్పమయింది కాదు సీరియల్ నవల్లా అధికమైంది కాదు కాదు, అనంతమైంది దానికి 'సమాప్తం' లేనేలేదు ఎప్పుడూ సశేషమే నేనెప్పుడూ కవితలూ, గేయాలూ అల్లలేదు, కానీ నీమీది ప్రేమ నా చేత ఈ కింది గేయాన్ని అల్లించింది

ప్రేమ ప్రేమ ప్రేమ ప్రేమ
ప్రేమ ప్రెమ ప్రేమ ప్రేమ
ప్రేమ ప్రేమ ప్రేమ ప్రేమ
ప్రేమ ప్రేమ ప్రేమ ప్రేమ

నా కథలు 16 వారపత్రికల్లో, 18 మాసపత్రికల్లో, 12 దినపత్రికల్లో, 4 అనువదింపబడిన ఇతర భాషా పత్రికల్లో పరిశీలనలో వున్నాయి కాని నా ప్రేమ లేఖ అయిన ఇది నీ ఒక్కరివద్దే పరిశీలనలో వుంది ఇదే నేను మొదటిసారిగా ప్రేమించడం గనుక

"అయ్యా! మీరు పంపిన ప్రేమరేఖ అందింది పరిశీలించాము దానిని మేము అంగీకరించామని తెలియజేయడానికి ఆనందిస్తున్నాము" అని నువ్వు వ్రాసే లేఖ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాను దీని వెంట స్వంత చిరునామా కల స్టాంపులు అతికించిన కవరు జత చేసాను కాబట్టి సమాధానం ఇవ్వమని గట్టిగా కోరుతున్నాను ఇది నా హృదయ ఘోష అని కూడా హామీ ఇస్తున్నాను

నా హృదయం మాసపత్రికలా దళసరి అయినది కాదు నా ప్రేమని తృణీకరిస్తే, దినపత్రికలా చిరిగిపోతూంది అది దయచేసి ఈ ప్రేమ లేఖమీద 'రిజెక్టెడ్' అని ఎర్ర సిరాతో వ్రాసే సంపాదకులలా దీన్నే త్రిప్పి పంపేయద్దు దీన్ని మళ్ళీ కాపీచేసి, తిరిగి వచ్చిన కథని ఇంకో పత్రికకి పంపినట్లుగా, ఈ లేఖను మరో ప్రేమామృతమూర్తికి పంపి, నా ప్రేమను రీ డైరెక్టు చేయలేను

నిన్నెంతగా ప్రేమిస్తున్నానంటే, ఒక్క వాక్యంలో వ్రాయాలంటే సినిమా నిర్మాత ఎవరైనా నా కథని సినిమాకి తీసుకుంటానని చెప్పినా, పోనీయ్, నా ప్రియురాలు నా ప్రేమ అంగీకరించానని చెప్పినప్పుడు నాకు కలిగిన ఆనందం ముందు, నీవు చెప్పిన ఈ చిన్న వార్త ఓ వార్తేనా?' అనగలను

"ఇక మీదట మీరు వ్రాసే రచనలన్నీ నా పేరు మీదే పంపాలి" లాంటి షరతు విధించినా నేను అందుకు సంసిద్ధమే

కనకమేడల వ్రాసిన 'మహామాయ' ఇరవయి నాలుగు భాగాల కోసం ఎంత ఆతృతగా ఎదురు చూసానో, నీ జవాబు కోసం అంత ఆదుర్దాగా ఎదురు చూస్తున్నాను

మార్చి 31 న వ్రాస్తున్న ఈ వుత్తరం నిన్ను ఏప్రిల్‌ఫూల్ చేయడానికి అనుకుని భ్రమపడకు సుమా! ఎల్లుండిదాకా ఆగలేక వ్రాసేస్తున్నాను

ఇది 'ఏప్రిల్‌ఫూల్' కథ కాదు. నూటికి నూరుపాళ్ళూ వుత్తరమే

నీ ప్రేమామృతాన్ని కోరే

'బిందు'

(అది నా కలం పేరు భీమారావు)

—మల్లాది వెంకటకృష్ణమూర్తి

---

మరో మినీ కథ

# సందేహం

"నాన్నా! అదేమిటి?"

"సముద్రం"

"లోతుగా ఉంటుందెంటి?"

"ఉంటుంది"

"నేను మునిగిపోతానేమిటి?"

"మునిగిపోతావు"

"అమ్మ?"

"అమ్మ కూడ"

"నువ్వో?"

"నేను కూడ"

"ఏనుగో?"

"అది కూడ"

"మరి ఏనుగు మీద ఏనుగెక్కితే?"

"అది కూడ మునిగిపోతుంది"

"దానిమీద ఇంకో ఏనుగెక్కితే?"

"అది కూడ మునిగిపోతుంది"

"మరి కిందేనుగు ఏమవుతుంది నాన్నా?"

"చచ్చిపోతుంది"

"మీదేనుగు?"

"అదీ చచ్చిపోతుంది"

"అల్లదేమిటి నాన్నా?"

"షిప్"

"చిప్పు అంటే?"

"పడవ"

"అది నీట్లో మునగదా?"

"మునగదు"

"ఎందుకు మునగదు?"

"తేలుతుంది కాబట్టి"

"ఎందుకు తేలుతుంది?

"మునగదు కాబట్టి"

"ఎందుకు మునగదు?"

"నాకు తెలీదు. మీ అమ్మనడుగు"

"ఛీ! నువ్వెప్పుడూ ఇంతే చెప్పవు అలాగయితే ఏడుస్తాను"

"వద్దు ఏడవకు చెప్తాను అదిగో కెరటాలు చూడు ఎంత బాగున్నాయో!"

"కెరటా లెందుకొస్తాయి నాన్నా?"

"అవీ అవీ సముద్రానికి కోపం వస్తుంది కాబట్టి"

"సముద్రానికి కోపం ఎందుకొస్తుంది?"

"మీ అమ్మ కెందు కొస్తుంది? అదీ అలాగే!"

"అమ్మ కెందుకు కోపం వస్తుంది?"

"నేను పెళ్ళి చేసుకొన్నానని"

"నువ్వెందుకు పెళ్ళి చేసుకొన్నావు?"

"అవును ఎందుకు చేసుకొన్నాను?"

— బి ఎస్ ఎన్ మూర్తి